సాక్షి అనకాపల్లి

బుధవారం, 5, ఏప్రిల్, 2023



అష్టదళ పద్మారాధన

విశాఖపట్నం: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్ట దళ పద్మారాధన నిర్వహించారు.



పోలమాంబ.. పాహిమాం

విశాఖ: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి పండగ అనుపు మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.

చందనోత్సవానికి ఏర్పాట్లు



సింహగిరిపై ఈ నెల 23న జరిగే చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులతో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సమీక్ష జరిపారు.

10లో



న్యూస్‌రీల్

ఉష్ణతాప ప్రదేశాలను గుర్తించండి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లిటౌన్: జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులు వీచే ప్రదేశాలను ముందుగా గుర్తించాలని అధికారులను జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళ వారం ఆయన వర్చువల్ విధానంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. వేసవి ఆరంభం నుంచి ఎప్పటికప్పుడు వాతా వరణశాఖ ద్వారా సమన్వయం చేసుకుంటూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. చలివేంద్రాల ఏర్పాటు, మండుటెండలో ప్రయాణించే వారికి సూచనలు, సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు. వడదెబ్బకు గురైన వారికి అందించే ప్రథమ చికిత్సపై డీఎంహెచ్‌వో హేమంత్‌ను ఆదేశించారు. వేసవిలో పాఠశాలల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మకు సూచించారు. బస్‌స్టేషన్లు, వీలుంటే బస్సుల్లో వేసవిలో మంచినీటి ఏర్పాట్లు చేయాలని ప్రజా రవాణా శాఖ జిల్లా అధికారి కె.పద్మావతిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటరమణ, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

నర్సీపట్నం: ఆదిత్య చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు నర్సీపట్నంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.30 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866846146, 9676636661 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సింహగిరిపై ఘనంగా పండిత సదస్సు



పండిత సదస్సులో స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం సాయంత్రం పండిత సదస్సు ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు విశేష అలంకరణ చేసి కల్యాణమండపంలో వేదికపై అధిష్టింపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రధాన దేవస్థానాల నుంచి వచ్చిన వేద పండితులు తమ పాండిత్యంతో స్వామిని కీర్తించారు. స్వామి వైభవాన్ని వివరించారు. దేవస్థానం తరపున అధికారులు, అర్చకులు పండితులను సత్కరించారు.

అదే విధంగా కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి స్వర్ణకవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రతి గురువారం మాత్రమే లభించే స్వర్ణకవచ అలంకారాన్ని ఏటా వార్షిక కల్యాణోత్సవాల్లో పండిత సదస్సు రోజు కూడా చేయడం పరిపాటి. అలాగే ఉదయం 7 గంటల నుంచి కల్యాణ ఉత్సవమూర్తుల చెంతన వైదిక సదస్సాన్ని నిర్వహించారు.

శెట్టిపాలెంలో మూడు రోజుల్లో పింఛన్ల పంపిణీ

మాకవరపాలెం: శెట్టిపాలెం సచివాయం పరిధిలో మూడు రోజుల్లో పింఛను నగదు పంపిణీకి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. శెట్టిపాలెం, జడ్.గంగవరం, భీమబోయినపాలెం గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేసేందుకు తీసుకెళ్తున్న రూ.16.15 లక్షలు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అపహరించుకుపోయిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ప్రభుత్వానికి నివేదించినట్టు ఎంపీడీవో మంగళవారం తెలిపారు. నగదు జమ కాగానే పింఛన్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

అయ్యన్న అలక!

- గంటాకు ప్రాధాన్యమివ్వడంపై కినుక
- చంద్రబాబు సమావేశానికి వచ్చేది లేదని స్పష్టీకరణ
- అయ్యన్నను బుజ్జగిస్తున్న టీడీపీ సీనియర్లు
- తన నియోజకవర్గంలో గంటా జోక్యంపై అనిత మండిపాటు

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు అయ్యన్నపాత్రుడు అలకబూనారు. పార్టీని అంటిపెట్టుకున్న తమని కాదని.. ఇన్ని రోజులూ పార్టీకి దూరంగా ఉన్న గంటా శ్రీనివాసరావుకు ప్రాధాన్యమివ్వడంపై రగిలిపోతున్నారు. పార్టీలో తన పాత్రపై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 5వ తేదీన విశాఖలోని వి-కన్వెన్షన్‌లో నిర్వహించే పార్టీ ఉత్తరాంధ్ర జోనల్ సమావేశానికి రానని తేల్చి చెప్పినట్లు సమాచారం. దీంతో అయ్యన్నను ఆ పార్టీ సీనియర్ నేతలు కొందరు బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నట్లు భోగట్టా. పార్టీలో తనకు ప్రాధాన్యతతోపాటు ఎమ్మెల్యే టికెట్, తన కొడుకుకు ఎంపీ సీటు ఇస్తామన్న స్పష్టమైన హామీ కోసం అయ్యన్న పట్టుబడుతున్నట్లు సమాచారం. మరో వైపు పాయకరావుపేట నియోజకవర్గంలోనూ గంటా జోక్యం చేసుకుంటూ తనకు టికెట్ రాకుండా చేస్తున్నారంటూ అనిత కూడా మండిపడుతున్నారు. బుధవారం సమావేశానికి అయ్యన్నతో పాటు గండి బాబ్జీ, ఎమ్మెల్యే వెలగపూడి హాజరుకావడంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

–సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

ఇన్ని రోజులుగా పార్టీకి దూరంగా ఉండి.. ఇప్పుడు ఎన్నికలకు ముందు హడావుడి చేస్తున్న నేతలతో జాగ్రత్తగా ఉండాలంటూ గతంలో విశాఖలో చంద్రబాబు నిర్వహించిన సమావేశంలోనే అయ్యన్నపాత్రుడు కుండబద్దలు కొట్టారు. ఎవరండీ గంటా.? లక్షల్లో ఒకరు.. ఆయన ఏమైనా పెద్ద నాయకుడా.? అని ప్రశ్నించారు. ఇన్ని రోజులుగా ఇంట్లో నక్కుకుని.. ఇప్పుడు బయటకు వస్తున్నారని.. వారితో జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ అధిష్టానం గంటాకే తాజాగా మద్దతు తెలపడం అయ్యన్నకు రుచించడం లేదు. తాజాగా జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అంతా తానే నడిపించినట్టుగా గంటా వ్యవహరించడంతో పాటు ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారానికి కూడా హాజరయ్యారు. ఈ వ్యవహారాలకు అయ్యన్న దూరంగా ఉన్నారు. తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ టికెట్ అడుగుతుంటే... వేరే వ్యక్తిని గంటా ప్రతిపాదిస్తున్నారని అయ్యన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాడోపేడో తేల్చుకునేందుకు అయ్యన్న సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

గంటా జోక్యంపై ఆగ్రహం

నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం బూరుగుపాలెంలో ఇటీవల జరిగిన స్థానిక పండగకు గంటాను రుత్తల యర్రాపాత్రుడు ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, మాజీ మంత్రి బండారు సత్యనారాయణను పిలిచారు. అయితే ఈ సమావేశానికి అయ్యన్న వ్యతిరేకులైన ముత్యాలపాప, బండారు హాజరయ్యారు. ఈ వ్యవహారం వెనుక కూడా గంటానే ఉన్నారనే అనుమానాలను అయ్యన్న వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పాయకరావుపేట నియోజకవర్గంలో కూడా గంటా జోక్యం చేసుకుంటున్నారంటూ అనిత ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో తనకు వ్యతిరేకంగా సమావేశమైన నేతలను పార్టీ నుంచి అనిత సస్పెండ్ చేయించారు. ఈ వ్యవహారంపై బహిష్కరణకు గురైన నేతలు అనిత



తీరుపై మండిపడుతున్నారు. కాపు నేతలను అనిత సహించడం లేదని, గతంలో కాపు నేతలపై చెప్పుతో దాడి చేయించారని విమర్శిస్తున్నారు. దీనిపై టీడీపీ సమాధానం చెప్పకపోతే ఆ పార్టీ తీరును ఎండగడతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. విశాఖలో జరిగే సమావేశానికి అయ్యన్నతో పాటు గండి బాబ్జీ, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి కూడా దూరంగా ఉంటారనే ప్రచారం జరుగుతోంది. అయితే.. వెలగపూడి మాత్రం తన తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో విజయవాడలో ఉన్నాననే సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. విశాఖలో బుధవారం జరిగే చంద్రబాబు సమావేశానికి ముందే పార్టీలో అంతర్గత కలహాలు రచ్చకెక్కడం చర్చకు దారి తీసింది.

కాపులపై అనిత కక్షసాధింపు

- గంటాను కలవడం వల్లే మాపై సస్పెన్షన్ వేటు
- పాయకరావుపేటలో బహిష్కృతులైన టీడీపీ నేతల ఆగ్రహం

-8లో

పింఛన్ కానుక దేశానికే ఆదర్శం

- అత్యధికంగా 63,42,805 మందికి సామాజిక పెన్షన్లు
- ఇంటి వద్దకు వచ్చి అందిస్తున్న ఘనత సీఎం జగన్ సర్కారుదే ..
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- తారువలో నూతన పింఛన్ల పంపిణీ



తారువలో నూతన పింఛన్లను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి మండలం తారువలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయన లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా 63,42,805 మంది అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ చేతివృత్తులవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి నెల వలంటీర్లు తెల్లవారుజామున తలుపు తట్టి ఇంటి వద్ద అందజేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో పింఛన్ల కోసం పంచాయితీ కార్యాలయాల వద్ద రోజులు తరబడి అవ్వాతాతలు పడిగాపులు కాసేవారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా వివక్షకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తూ పాలనలో సరికొత్త అధ్యాయానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ఈ నెల ఒకటి, రెండు తేదీలు సెలవు దినాలు కావడంతో మూడో తేదీ నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైందని, ఐదు రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి రాజీనామా



రాజీనామా లేఖను కమిషనర్‌కు అందజేస్తున్న చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

నర్సీపట్నం: మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. కమిషనర్ కనకారావును కలిసి రాజీనామా లేఖ అందజేశారు. కుటుంబ బాధ్యతల దృష్ట్యా చైర్‌పర్సన్‌గా వ్యవహరించడం కష్టమని భావించి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మెజారిటీ సాధించి అధికార పీఠం దక్కించుకుంది. 2020 మార్చి 18న చైర్‌పర్సన్‌గా ఆదిలక్ష్మి, వైస్‌చైర్మన్‌గా గొలుసు నర్సింహమూర్తిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ.. రెండేళ్ల పాటు ఆదిలక్ష్మి చైర్‌పర్సన్‌గా, నర్సింహమూర్తి వైస్ చైర్మన్‌గా ఉంటారని, రెండేళ్ల తర్వాత బోడపాటి సుబ్బలక్ష్మి చైర్‌పర్సన్‌గా, కోనేటి రామకృష్ణ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు చేపడతారని ప్రకటించారు. సోమవారం వైస్ చైర్మన్‌గా గొలుసు నర్సింహమూర్తి రాజీనామా చేయగా, మంగళవారం ఆదిలక్ష్మి రాజీనామా పత్రం అందజేశారు. రాజీనామా చేయడానికి ముందు చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, సోదరుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడబండి నాగేశ్వరరావు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. రాజీనామా చేసేందుకు వచ్చిన చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్లు గొలుసు నర్సింహమూర్తి, వీరమాచినేని జగదీశ్వరి, మాకిరెడ్డి బుల్లిదొర, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- గృహనిర్మాణాన్ని వేగవంతం చేయాలి
- అధికారులు ప్రొటోకాల్ పాటించాలి
- గైర్హాజరు అధికారులపై చర్యలు
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో శ్రీరామ్మూర్తి

సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయాలని, వాటి ఫలితాలు అర్హులందరికీ అందేలా చూడాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై జెడ్పీటీసీలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. పెళ్లి కానుకపై గ్రామ సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్లను సత్వరమే పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న కొందరికి పింఛన్లు మంజూరు కావడం లేదని ఒక సభ్యుడు సభ దృష్టికి తెచ్చారు. దీనిపై అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ సమాధానమిస్తూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు తలెత్తడం వల్ల ఆలస్యమవుతోందని, ఈ విషయాన్ని విజయవాడ అధికారులకు తెలియజేశామని చెప్పారు. ఇంట్లోనే టైలరింగ్ వృత్తి చేసుకునే టైలర్లకు కూడా జగనన్న చేదోడు కింద రూ.10 వేలు చెల్లించేందుకు అనుమతి లభించిందని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.ప్రసాద్ చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు మేలు జరిగేలా, అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఆసరా వంటి పథకాల చెల్లింపులకు ముందు లబ్ధిదార్లతో సమావేశం నిర్వహించాలని గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు కోరారు. వేములపూడి హైస్కూల్‌లో అదనపు తరగతి గదులు లేక 250 మంది విద్యార్థులు వెనక్కి వెళ్లిపోయారని నర్సీపట్నం జెడ్పీటీసీ ఎస్.రమణమ్మ తెలిపారు. అక్కడ అదనపు గదుల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు చైర్‌పర్సన్ సూచించారు.

కేజీహెచ్‌లో మెరుగైన సేవలు

విశాఖ కేజీహెచ్‌లో గతంకంటే వైద్య సేవలు మెరుగయ్యాయని జెడ్పీ చైర్‌పర్సన్ సహా పలువురు సభ్యులు కితాబునిచ్చారు. ప్రస్తుత సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ సమస్యలపై స్పందిస్తున్నారన్నారు. చిన్న పిల్లల ఆరోగ్యం బాగా క్షీణించాక కేజీహెచ్‌కు తీసుకొస్తున్నారని, దీంతో వీరిలో ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారని అశోక్‌కుమార్ చెప్పారు. అందువల్ల అనారోగ్యంతో ఉన్న పిల్లలను సకాలంలోనే కేజీహెచ్‌కు తీసుకురావాలని కోరారు. గత మూడు నెలల్లో కేజీహెచ్‌లో 214 మంది పిల్లలను తీవ్ర అనారోగ్యంతో చేర్చారని, వీరిలో 164 మందికి నయం చేసి పంపామని, 12 మంది పిల్లలు మరణించారని వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



చోడవరం: భూములు రీ సర్వేకు రైతులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కోరారు. మండలంలోని అంబేరుపురం, గంథవరం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ సర్వేను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులంతా దగ్గరుండి మరీ తమ భూములను సర్వే చేయించుకోవాలని, లోపాలు ఉంటే చెప్పాలని సూచించారు. సరిహద్దులపై రైతులు వివాదాలకు దిగవద్దని, రికార్డుల ప్రకారం సర్వే జరుగుతుందన్నారు. అభ్యంతరాలు ఉంటే సర్వే చేసే అధికారులకు నివేదించుకోవచ్చన్నారు. సర్వేపనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. డ్రోన్ల సాయంతో చేయాల్సిన సర్వేను కూడా వేగంగా పూర్తిచేయాలన్నారు. సర్వేలో రైతుల సూచనల్ని పరిగణంలోకి తీసుకుని, ఎవరికీ ఇబ్బందిలేకుండా రికార్డుల ప్రకారం సర్వే చేసి రైతులకు అప్పగించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న గృహ సముదాయాలను పరిశీలించారు. జగన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. లబ్ధిదారులు వేగంగా ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ తిరుమలరావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరి పాల్గొన్నారు.

తారువలో కింగ్ కోబ్రాలు హల్‌చల్

- భయాందోళనతో పరుగులు తీసిన ప్రజలు
- 3 గంటలు శ్రమించి పాముల్ని పట్టుకున్న వైనం



కింగ్ కోబ్రాను పట్టుకుంటున్న ఈస్టర్న్ ఘాట్స్ వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు మూర్తి

దేవరాపల్లి: కింగ్ కోబ్రా(రాచనాగు).. ఒకటి ఎదురుపడితేనే గుండెల్లో దడదడ మొదలవుతుంది. అలాంటిది ఒకేసారి మూడు కింగ్ కోబ్రాలు.. ఒకే చోట తారసపడితే.. చెప్పేందుకేముంది..? హడలెత్తుతూ పరుగులు తీయడమే..! దేవరాపల్లి మండలంలోని తారువ గ్రామానికి ఆనుకుని ప్రవహిస్తున్న ఏటి బాడవ గెడ్డలో మంగళవారం మధ్యాహ్నం స్థానికులకు ఇదే పరిస్థితి ఎదురయింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు అటుగా వెళ్లిన యువకులకు మూడు కింగ్ కోబ్రాలు బుసలు కొడుతూ కనిపించాయి. దీంతో వారు ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు. ఈ విషయాన్ని చోడవరం అటవీశాఖ రేంజర్ బి.వి.వర్మకు ఫోన్లో తెలిపారు. ఆయన విశాఖపట్నానికి చెందిన ఈస్టర్న్ ఘాట్స్ వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు కంఠి మహంతి మూర్తికి సమాచారం అందించారు. అటవీశాఖకు చెందిన బీట్ ఆఫీసర్ పి.శివకుమార్, ఎఫ్‌డీవో ఎం.నారాయణ తదితరులతో కలిసి పాములు ఉన్న ప్రాంతానికి మూర్తి చేరుకున్నారు. నీరు ప్రవహిస్తున్న గెడ్డకు ఆనుకుని పొదల్లో ఉన్న మూడు రాచ నాగులను సుమారు మూడు గంటల పాటు శ్రమించి అతి కష్టం మీద పట్టుకున్నారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వీటిలో రెండు ఆడ జాతి పాములు కాగా ఒకటి మగ జాతికి చెందినదిగా నిర్ధారించారు. ఒక్కొక్కటి 13 నుంచి 15 అడుగుల పొడవు ఉన్నాయి. వీటిని చింతలపూడి పంచాయతీ సమ్మెద సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టినట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

అక్రమాల 'డస్ట్'పై ఆర్డీ విచారణ

- యలమంచిలి మున్సిపాలిటీలో రూ.20 లక్షలు దుర్వినియోగమైనట్టు ఆరోపణలు
- అధికార పక్షం ఫిర్యాదులపై ఉన్నతాధికారి ప్రాథమిక దర్యాప్తు



నిధుల దుర్వినియోగంపై ఆర్డీ నాగరాజుకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

యలమంచిలి: మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగం ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. స్వయానా అధికార పక్షానికి చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులే లోటుపాట్లను ఎత్తిచూపడంతో ఉన్నతాధికారులు స్పందించారు. మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు మంగళవారం వచ్చి రికార్డులు తనిఖీ చేశారు. ఆరోపణలు ఎక్కుపెట్టిన మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు దూది నర్సింహమూర్తి, మరిణేశ్వరరావు, గొర్లె వెంకట్, పిల్లా త్రినాథ్‌లతో మాట్లాడారు. వారి నుంచి వివరాలు సేకరించారు.

ఇంతకూ ఏం జరిగింది..?

మున్సిపాలిటీలో డస్ట్‌బిన్‌ల పేరిట భారీ అవినీతి జరిగిందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మొత్తం రూ.20 లక్షల వరకు దుర్వినియోగం జరిగిందని, డస్ట్‌బిన్‌లు కొనకుండానే రూ.10.68 లక్షల నిధులు డ్రా చేశారని ఆరోపణ. వాటి ట్రాన్స్‌పోర్ట్ చార్జీల కింద మరో రూ.62 వేల ఖర్చు చూపించారు. నలుగురు పారిశుధ్య సహాయకులను నియమించినట్టు చూపి, వారి జీతభత్యాల కింద రెండేళ్లలో రూ.5,54,796 స్వాహా చేశారని అభియోగం. పారిశుధ్య సహాయకుల కాస్మొటిక్స్‌ల పేరుతో రూ.3 లక్షల 15 వేల 204 భోంచేశారని, ఇలా మొత్తం రూ.20 లక్షల మేర అవినీతి జరిగినట్టు అధికార పక్షం ఆరోపించింది.

కొనకుండానే రూ.10.68 లక్షల నిధులు డ్రా

యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో 46,995 డస్ట్‌బిన్‌లు అవసరమని మున్సిపల్ సమావేశంలో రెండేళ్ల కిందట కమిషనర్ కృష్ణవేణి తీర్మానం చేశారు. తడి, పొడి, ప్రమాదకర చెత్త సేకరణ కోసం బ్లూ, గ్రీన్, రెడ్ కలర్ డబ్బాలు కొనాలని నిర్ణయించారు. అయితే మొదటి విడతగా 15 వేల డబ్బాలు, రెండో విడత 15 వేల చెత్త డబ్బాలను కొనుగోలు చేశారు. వీటిలో 21 వేల డబ్బాలను మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన 9 వేల డబ్బాలు గోడౌన్లలో ఉన్నట్టు చెబుతున్నారు. ఇక మూడో విడత 16,995 డస్ట్‌బిన్‌లు కొనకుండా కొనేసినట్టు కమిషనర్ ఆధ్వర్యంలో బిల్లులు సృష్టించి సుమారు రూ.10,68,686 లక్షలు కాజేసినట్టు ఆరోపణ. దీనికి సంబంధించి 2022 జూన్ 22న ఈ నిధులను డ్రా చేసినట్టు రికార్డులు సృష్టించడం విశేషం.

కమిషనర్ డుమ్మా

ఆర్డీ విచారణకు వచ్చినా మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి కనిపించలేదు. సోమవారం వరకూ సెలవులో ఉన్నట్టు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న డీఈఈ వీరయ్య చెప్పారు. అయితే విచారణాధికారి వెళ్లిపోగానే సాయంత్రం కమిషనర్ కార్యాలయంలో ప్రత్యక్షమవడం, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది.

7 నుంచి 'జగనన్నే మన భవిష్యత్తు'



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

- దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు
- వైఎస్సార్ ఆసరా సభలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: దేశంలో మరెక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఇతర రాష్ట్రాల సీఎంలు వాటిని ఆదర్శంగా తీసుకుంటున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి చేతుల మీదుగా పట్టణ పరిధిలోని 11,472 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు మూడో విడత ఆసరా పథకంలో భాగంగా రూ.10 కోట్ల 2 లక్షల 33 వేల 421 నమూనా చెక్కును అందించారు. అంతకుముందు దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల ద్వారా బడుగు బలహీనవర్గాలకు రెండు లక్షల కోట్ల రూపాయల లబ్ధిని చేకూర్చిన ఏకైక సీఎం జగనేనని కొనియాడారు. ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభించనున్నట్టు వెల్లడించారు.

ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ కరోనాతో రెండేళ్లపాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నా, ఎన్నికల హామీలనుఅమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. కరోనాలో ఆదాయ వనరులు లేకపోయినా సకాలంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేరన్నారు. వైద్య రంగంలో అనేక మార్పులు తెచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, కొణతాల నీలిమ, జెడ్పీ పి.వెంకటరమణ, జీవీఎంసీ ఏపీడీ దుర్గాప్రసాద్, ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్లు డాక్టర్ రామ్మూర్తి, ఏవీ రత్నకుమారి, ఎంపీ భర్త కాంద్రేగుల విష్ణుమూర్తి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొద్దేడ శివ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్ననే గెలిపిద్దాం



ఇద్దరు ముఖ్యమంత్రుల పాలన చూశాను. ఇప్పటి వరకూ ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రిని నేనెరగను. కరోనా సమయంలో మా కుటుంబం ఆర్థిక ఇబ్బందులన్నీ జగనన్న సంక్షేమ పథకాల వల్లే తొలగాయి. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని డ్వాక్రా మహిళలం గెలిపించి తీరతాం.

– పి.సత్యవతి, అనకాపల్లి

క్లుప్తంగా

నగదు చోరీపై ముమ్మర విచారణ

మాకవరపాలెం: పింఛన్ల నగదు చోరీపై క్రైం బ్రాంచి పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మండలంలోని దుంగలవానిపాలెం వద్ద సోమవారం రూ.16.15 లక్షల నగదు చోరీకి గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన క్రైం బ్రాంచి ఎస్ఐ రమేష్ మంగళవారం కూడా నగదు డ్రా చేసిన బ్యాంకులోని సీసీ ఫుటేజీలతోపాటు రోడ్డుకు ఇరువైపులా వివిధ షాపులు, షోరూం వద్ద ఉన్న సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రైల్వే ట్రాక్ వద్ద ఉన్న గుర్తు తెలియని మృతదేహం

అరకులోయ రూరల్: మండలంలో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని అరకులోయ రైల్వే ఆర్పీఎఫ్ ఎస్ఐ మహేష్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 ఉంటుందన్నారు. స్థానికుల నుంచి సమాచారం తెలుసుకున్న ఆయన విజయనగరం రైల్వే జీఆర్పీ పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం సంఘటన స్థలం చేరుకుని పరిశీలించారు. రెండు రోజుల క్రితం ఈ సంఘటన జరిగి ఉండవచ్చన్నారు. మృతదేహం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, బంధువులు ఎవరైనా ఉంటే ఏరియా ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు.

ఆసరాతో అక్కచెల్లెమ్మలకు స్వావలంబన

- ఎన్నికల హామీ నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ, జెడ్పీటీసీ

రోలుగుంట: ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని, అధికారంలోకి రాగానే ఎన్నికల హామీలు నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును ఆయన అందజేశారు.ధా సమయంలో మహిళల కరతాళ ధ్వనుల మధ్య సభా ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ మండలంలోని 1,007 సంఘాల్లో 10,783 మంది సభ్యులకుగాను ఒక విడతకు రూ.7.51 కోట్ల చొప్పున మూడు దఫాలుగా రూ.22 కోట్లు మంజూరైందన్నారు. గత టీడీపీ పాలకుల హయాంలో సంక్షేమ పథకాలు దుర్వినియోగం చేశారని దుయ్యబట్టారు. అర్హులైన వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అయినప్పటికీ జన్మభూమి కమిటీలు మొండి చేయి చూపాయని తీవ్ర స్థాయి ధ్వజమెత్తారు. ఆనాడు చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని ఎన్నికల హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే మహిళలను మోసం చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని కొనియాడారు. దీనిపై పలువురు మహిళలు తమ అభిప్రాయాలను సభలో వినిపించారు. తాము వివిధ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధిని, వ్యక్తిగత మేలును ఆనందంగా వివరించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీరమణమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వెలుగు అధికారులు, డ్వాక్రా అక్కచెల్లెమ్మలతో కలిసి ప్రభుత్వ విప్ ధర్మశ్రీ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మడ్డు అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు శెట్టి సత్యనారాయణమూర్తి, పోతల లక్ష్మీశ్రీనివాస్, వెలుగు ఏపీఎం సాధన, వివిధ గ్రామాల తాజా, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

మునగపాక: రాజుపేటకు చెందిన యువకునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు పరవాడ డీఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. మండలానికి చెందిన మైనర్ బాలిక గత నెల 8వ తేదీన కళాశాలకు వెళతానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాలిక తల్లిదండ్రులు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇదే మండలానికి చెందిన యువకుడు సదరు బాలికతో కలిసి హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించి, అక్కడ నుంచి బాలికను తీసుకువచ్చా రు. అయితే యువకుడి ఆచూకీ లేకపోవడంతో గాలింపు చేపట్టారు. మంగళవారం రాజుపేట సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ యువకుడు కనిపించడంతో అతనిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ల అందజేత



గాజువాకలో శ్రీరామ్మూర్తికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మీభారతి



అనకాపల్లిలో వెంకట సాయికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ వేణుబాబు

కె.కోటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ల వ్యవస్థ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేస్తూ ప్రశంసలందుకుంటోంది. తాజాగా అనారోగ్యంతో వైద్య సేవలు పొందుతున్న వారికి తమ సొంత ఖర్చులతో వెళ్లి గాజువాక, అనకాపల్లిలో పింఛన్ల సొమ్ము అందించారు. కె.కోటపాడు మండలం కింతాడకు చెందిన బండారు శ్రీరామ్మూర్తి మూణ్నెల్లుగా గాజువాకలో చికిత్స పొందుతూ అక్కడ తన బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. దాంతో గ్రామ వలంటీర్ లక్ష్మీభారతి మంగళవారం అక్కడకు చేరుకుని పింఛన్ అందించింది. వలంటీర్‌ను సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు అభినందించారు. చౌడువాడకు చెందిన సిహెచ్.వెంకటసాయి అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో వైద్య సేవలు పొంది అనకాపల్లిలో తన కుమారుడు వద్ద ఉంటోంది. ఈమె ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో గ్రామ వలంటీర్ సవరాల వేణుబాబు అక్కడకు తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ అందించాడు.

కొమళ్లపూడిలో పట్టపగలే దొంగతనం

- ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు వగులగొట్టిన దుండగులు
- బంగారం, వెండి నగలు, నగదు చోరీ
- క్లూస్ టీంతో విచారణ చేస్తున్న పోలీసులు



దొంగతనం జరిగిన ఇంట్లో విచారణ చేస్తున్న క్లూస్ టీం,ఎస్ఐ కుమారస్వామి



బీరువా పగలగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

బుచ్చెయ్యపేట: పట్టపగలే ఇంటి తాళాలు పగలు గొట్టి బీరువాలో దాచిన బంగారు, వెండి నగలుతో పాటు నగదు పట్టుకుపోయిన సంఘటన బుచ్చెయ్యపేట మండలం కొమళ్లపూడిలో జరిగింది. బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి కథనం మేరకు గ్రామానికి చెందిన పాము రాము మంగళవారం ఉదయం మాడుగుల మండలం గాదిరాయిలో ఉంటున్న తన అత్తవారింటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చి చూడగా ఇంటి తాళాలు తీసి ఉండడం, లోపల బీరువాలు తెరిచి బట్టలు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఇంట్లో దాచిన 8 తులాలు బంగారం, 10 తులాలు వెండి వస్తువులు, రూ. 5 వేలు వరకు నగదు దొంగతనం జరిగినట్టు బాధితుడు తెలిపాడన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్ టీంను రప్పించి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పోలీసులకు తెలిపిన వస్తువులతో పాటు ఇంకా ఎక్కువ మొత్తంలో వస్తువులు పోయినట్టు బాధిత కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. బాధితుడు స్కూల్ కమిటీ చైర్మన్‌గా, ఆటో డ్రైవర్‌గా పనిచేయడంతో పలువురు నాయకులు బాధితుడిని పరామర్శిస్తున్నారు.

వివాదాలు లేని భూముల్లో సర్వే రాళ్లు

జేసీ కల్పనాకుమారి



సర్వే రాళ్లు వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేసీ కల్పనాకుమారి

కశింకోట: సమగ్ర భూ రీ-సర్వేలో భాగంగా వివాదాలు లేని భూములకు సర్వే రాళ్లు వేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని కశింకోట, తాళ్లపాలెం వద్ద గైతులపాలెం ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కూలీలు, కాంట్రాక్టర్ల సహకారంతో సర్వే రాళ్ల వేస్తున్న తీరును మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేలో గుర్తించిన ప్రాంతాల్లో సర్వే రికార్డులకు అనుగుణంగా వివాదాలకు తావు లేకుండా రాళ్లు అమర్చాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, సర్వేయర్ ధనుంజయ, ఉపాధి ఏపీవో శివ, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి

డీపీవో శిరీషారాణి



వానపాములు విడుదల చేస్తున్న డీపీవో శిరీషారాణి

నాతవరం: జిల్లాలో చెరువుల సుందరీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డీపీవో ఆర్. శిరీషారాణి తెలిపారు. మండలంలోని వెదురుపల్లి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మంగళవారం ఆమె వానపాములు విడుదల చేశారు. అక్కడ చెరువు గట్టుపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 645 పంచాయతీల్లో 600పైగా షెడ్లు నిర్మించి వానపాములు విడుదల చేసి సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నామన్నారు. వీటి విక్రయాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. ప్రతి పంచాయతీలో చెరువు గట్లను పటిష్టం చేసి మొక్కలు నాటడంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. మిగతా చెరువులు విడతల వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలోని 24 మండలాల్లో రూ.32 కోట్లకు పైగా ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా, 75 శాతం మాత్రమే అయిందన్నారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణాలను యుద్ధప్రాతిపాదికన పూర్తి చేసేందుకు దృష్టి సారించామన్నారు. నర్సీపట్నం డివిజన్ పంచాయతీ అధికారి మూర్తి, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఈవోపీఆర్డీ ప్రేమలీల, సర్పంచ్ కాళ్ల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు చినబాబు, హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థుల జీవితాల్లో వెలుగులు

ఎ.కోడూరులో నాడు-నేడు పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి



భవన నిర్మాణ శ్లాబ్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎ.కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు రెండో దశలో భాగంగా అదనపు భవనాల శ్లాబ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత నాడు-నేడు పనుల్లో భాగంగా రూ.65 లక్షలతో తరగతి గదుల్లో అభివృద్ధి పనులు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రెండో విడతలో ఆరు అదనపు భవనాల నిర్మాణానికి రూ.69 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. హెచ్ఎం అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్, గొర్రుపోటు వెంకటరావు, పీఎంసీ కమిటీ చైర్మన్ లెక్కల అర్జున, తర్రా మోహన్‌రావు, పుట్టా శ్రీధర్, ఎంపీటీసీ లెక్కల గౌతమి, శంకరరావు పాల్గొన్నారు.

కాపులపై అనిత కక్ష సాధింపు

- గతంలో కార్యకర్తపై చెప్పుతో దాడి
- గంటాను కలవడం వల్లే మాపై సస్పెన్షన్ వేటు
- పాయకరావుపేటలో బహిష్కృతులైన టీడీపీ నేతల ఆగ్రహం
- పార్టీకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరిక



మాట్లాడుతున్న టీడీపీ బహిష్కృత నాయకులు రాజబాబు, నారాయణరావు

నక్కపల్లి/పాయకరావుపేట: నియోజకవర్గంలో కాపులపై మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొర్లె రాజబాబు, పాయకరావుపేట పట్టణశాఖ మాజీ అధ్యక్షుడు తుని, పాయకరావుపేట పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఆరోపించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఈ ఇద్దరు నాయకులను సస్పెండ్ చేస్తున్నట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం వారు పాయకరావుపేటలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం వారిని అనిత చులకనగా చూస్తోందన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నడిరోడ్డుపై చెప్పుతో కొట్టిందన్నారు. టీడీపీలో కాపు నాయకుడిగా ఉన్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇటీవల నక్కపల్లి మండలం వేంపాడుకు చెందిన టీడీపీ నాయకుడు కల్లేపల్లి బాబ్జిరాజు ఇంటికి వస్తే తాము వెళ్లి గంటాను కలిశామన్నారు. దీనిపై కక్ష కట్టిన అనిత తమను పార్టీ నుంచి సస్పెండ్ చేయించిందన్నారు. అనిత ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆమె చేస్తున్న అవినీతి అక్రమాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో ఆమెకు పాయకరావుపేట టికెట్ ఇవ్వలేదన్నారు. అప్పటినుంచి అనిత తమపై కక్ష కట్టిందన్నారు. అనిత నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తమను కలుపుకొనిపోవడం లేదని, పార్టీ కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం లేదన్నారు. అయినా పాయకరావుపేటలో ప్రతి పార్టీ కార్యక్రమం తాము నిర్వహిస్తున్నామన్నారు. తాము ఎటువంటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదన్నారు. షోకాజ్ నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర నాయకత్వం తమను సస్పెండ్ చేయడానికి గల కారణాలను తెలియజేయాలని తమపై సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి పార్టీలో కాపులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామన్నారు. పార్టీ నిర్ణయం మార్చుకోకపోతే రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరికీ భయపడే ప్రసక్తి లేదన్నారు. అధిష్టానం తమకు న్యాయం చేయకపోతే తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

వివాదంలో ఉన్న భూముల్లో పనుల అడ్డగింత



వివాదంలో ఉన్న భూముల్లో పనులను అడ్డుకుంటున్న ఫిర్యాదుదారులు

గొలుగొండ: నర్సీపట్నం ఆర్డీవో కోర్టులో వివాదంలో ఉన్న భూములను గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేపట్టి ఈ భూముల్లో లే అవుట్లు వేసేందుకు పనులు చేపడుతున్నారని ఫిర్యాదు అందడంతో మంగళవారం ఆ పనులను నిలుపుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గొలుగొండ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 490లో 3.67 ఎకరాలు భూమి ఉంది. జోగుంపేటకు చెందిన చేపల వెంకయ్యమ్మ పేరున ఈ భూమి 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేసుకున్నారు. వెంకయ్యమ్మకు కుమారుడు గంగులు, కుమార్తె దొంగతల్లి(చిట్టమ్మ) ఉన్నారు. ఈ నేపథ్యంలో గంగులు వారసులకు ఈ భూమి అన్యాయంగా దఖలు పడిందని ఆరోపిస్తూ వెంకయ్యమ్మ కుమార్తె దొంగతల్లి(చిట్టమ్మ) ఆర్డీవో కోర్టులో రెండేళ్ల క్రితం కేసు వేశారు. తన తల్లి వెంకయ్యమ్మ పేరున ఉన్న భూమిలో తనకు కూడా వాటా వస్తుందని కేసు వేశారు. ఈ కేసు నడుస్తున్న సమయంలోనే గంగులు వారసులు ఈ భూమిని అమ్మకోవడం జరిగిందని, ఆ భూమిలో లేఅవుట్ పనులు చేపడుతున్నారని చిట్టిమ్మ వారసులు అధికారులను ఆశ్రయించడంతో పాటు మంగళవారం ఆ భూమిలో చదును పనులను అడ్డుకున్నారు. గంగులు వారసులు ఆ భూమిని నర్సీపట్నంకు చెందిన వ్యక్తులకు అమ్మకాలు జరిపారని ఆరోపించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇక్కడ ఎటువంటి పనులు చేయరాదని అక్కడి వారిని హెచ్చరించి పనులు నిలుపుదల చేశారు. వివాదం ఆర్డీవో కోర్టులో ఉన్నందున భూమి అమ్మకాలు, కొనుగోళ్లు జరపరాదని స్పష్టం చేశారు. ఆర్ఐ నర్సింగరావు, వీఆర్వో రాజుబాబు, ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై పర్యవేక్షణ

జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి మురళీధర్



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి మురళీధర్

కె.కోటపాడు: గర్భిణుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతను ఎప్పటికప్పుడు ఆశా కార్యకర్తలు పర్యవేక్షించాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి మురళీధర్ తెలిపారు. మండలంలోని చౌడువాడ పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి మెరుగైన వైద్యం అందేలా వైద్య సిబ్బంది సహకారం తీసుకోవాలని ఆశాలకు సూచించారు. వీటితోపాటు పౌష్టికాహారం, రక్తహీనత సమస్యలు రాకుండా ఆరోగ్య జాగ్రత్తలు, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలతో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పించాలన్నారు. టి.బి.ప్రోగ్రాం అధికారి కిశోర్‌కుమార్, వైద్యాధికారి నిర్మల, ఎంపీహెచ్ఈవో కె.వి.రాజశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ మూర్తి, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం

అనకాపల్లి టౌన్: జాతీయ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన నరేంద్ర నత్తా చాటాడు. పురుషుల విభాగంలో 93 కేజీలు, స్కాట్‌లో 270 కేజీల బరువు ఎత్తి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. బెంచ్‌ప్రెస్‌లో 152 కేజీల విభాగంలో కాంస్య పతకం, డెడ్‌లిఫ్ట్‌లో 260 కేజీలు, మొత్తం 682.5 కేజీల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా నిలవడం ఆనందంగా ఉందని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొణతాల అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

షూటింగ్‌కు అసనగిరి, సుందరకోట అనుకూలం

అనుభవించు రాజా ఫేమ్ డైరెక్టరు గవిరెడ్డి శ్రీనివాస్



సినిమా యూనిట్‌తో పరిశీలిస్తున్న డైరెక్టరు గవిరెడ్డి శ్రీనివాస్

నాతవరం: ఏజెన్సీని తలపిస్తున్న సుందరకోట, అసనగిరి అటవీ ప్రాంతం సినిమా షూటింగ్‌లకు ఎంతో అనుకూలమని అనుభవించు రాజా సినిమా డైరెక్టరు గవిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సరుగుడు, సుందరకోట, అసనగిరి, తాండవ ప్రాజెక్టు ప్రాంతాలను మంగళవారం ఆయన సినిమా యూనిట్‌తో సందర్శించారు. ఇంతవరకు ఈ ప్రాంతానికి సరైన రహదారి సౌకర్యం లేక సినిమా షూటింగ్‌లకు సంబంధించి ఎవ్వరు రాలేదన్నారు. ఇటీవల ఆదర్శ బాలకృష్ణ హీరోగా నటిస్తున్న నూతన సినిమాలో పలు కీలక సన్నివేశాలు చిత్రీకరించేందుకు ఈ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. సినిమా లోకల్ మేనేజర్ షేక్ రజాక్, ఆర్ట్ డైరెక్టరు సుప్రియ, సీనియర్ కెమెరామన్ యువరాజ్, కో డైరెక్టరు భూపతి, కెమెరా అసిస్టెంటు శివ పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవ.. లారస్ ఔదార్యం


వసతి గృహంలో నిర్వహిస్తున్న పనులు


కశింకోటలోని సమగ్ర సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం

- సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహానికి మెరుగులు
- రూ.35 లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభం

కశింకోట : స్థానిక సమగ్ర సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చొరవతో లారస్ పరిశ్రమ యాజమాన్యం రూ.35 లక్షలు కేటాయించి, పనులు నిర్వహించేందుకు ముందుకు వచ్చింది. గత వారం పనులు ప్రారంభించారు.

ఏజెన్సీకి చెందినవారే ఎక్కువ

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన సాంఘిక సంక్షేమశాఖ నిర్మించిన భవనంలో బాలికల వసతి గృహం 2010లో ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాలికలు వచ్చి ఇక్కడ చేరారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 346 మంది బాలికలు ఈ వసతి గృహంలో ఉంటూ పక్కనే ఉన్న జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో చదువుతున్నారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన బాలకలకు ఈ వసతి గృహం చాలా అనుకూలం. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన చింతపల్లి, పాడేరు, లంబసింగి తదితర చోట్ల నుంచి సుమారు 120 మంది వరకు బాలికలు ఇక్కడ చేరి, చదువుకుంటున్నారు.


ప్రత్యేక గదిలో చదువుతున్న టెన్త్ విద్యార్థులు

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు

తమ ప్రాంతాల్లో వసతి గృహాలున్నప్పటికీ ఏజెన్సీ నాగరికత నుంచి బయట పడటంతోపాటు మైదాన ప్రాంతానికి అలవాటుపడతారని తల్లిదండ్రులు వారి పిల్లల్ని ఇక్కడ చేర్చుతున్నారు. పక్కనే స్కూల్‌తో వసతిగృహం అనుకూలంగా ఉంది. తమ ప్రాంతాల నుంచి రాకపోకలకు రవాణా సదుపాయం కూడా వీలుగా ఉంది. ప్రస్తుతం 48 మంది బాలికలు టెన్త్ చదువుతున్నారు. వారికి ప్రత్యేక గది ఏర్పాటు చేసి, చదివిస్తున్నారు. వసతి గృహం భవనం కొన్ని చోట్ల పాడవడం, పైప్‌లైన్లు దెబ్బతినడం, నీళ్ల ట్యాంకు శిథిలవడంతో విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారు.

కలెక్టర్ సూచన.. లారస్ నిధుల కేటాయింపు

వసతిగృహ సందర్శన సమయంలో ఈ సమస్యల్ని బాలికలు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సూచనల మేరకు పరవాడలోని లారస్ పరిశ్రమ యాజమాన్యం సదుపాయాలు మెరుగుపరిచేందుకు ముందుకు వచ్చింది. రూ.35 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టింది. ఈ పనుల తీరును ఇటీవల కలెక్టర్ పరిశీలించారు. అవసరమైన మరమ్మతులు చేసి, పిల్లల మెరుగైన భవిష్యత్తు కోసం సదుపాయాలు మెరుగుపర్చాలని పరిశ్రమ నిర్వాహకులకు ఆయన సూచించారు. ప్రస్తుతం భవనం మధ్య భాగంలో దెబ్బతిన్న ఎలివేషన్ పనులు జరుగుతున్నాయి. బాలికలకు ఇబ్బంది కలగకుండా పైపులైన్ల మరమ్మతులు, ఇతర పనులను వేసవి సెలవుల్లో చేపట్టాలని భావిస్తున్నారు. పనులు పూర్తయితే ఇబ్బందులు తొలగినట్టేనని బాలికలు, తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో పనులు పూర్తి

కలెక్టర్ చొరవ, లారస్ పరిశ్రమ ఆర్థిక సహకారంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. వేసవి సెలవులు ముగిసేలోగా పనులు పూర్తి చేసేలా పరిశ్రమ సిబ్బంది కృషి చేస్తున్నారు. పనులు పూర్తయితే మెరుగైన వసతి సౌకర్యం విద్యార్థులకు అందనుంది.

–పి.నిర్మల, సంక్షేమ అధికారి, సమగ్ర బాలికల వసతిగృహం, కశింకోట

నేడు ఆసరా నిధుల పంపిణీ


సభా వేదిక


కశింకోట మండల పరిషత్ ఆవరణలో సభా ఏర్పాట్లు

కశింకోట : మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధుల పంపిణీకి స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో భారీ ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ సభలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఆయన చేతుల మీదుగా 1537 స్వయం సహాయక సంఘాలకు మంజూరైన మూడో విడత నిధులు రూ.13.27 కోట్ల చెక్కును అందజేయనున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతలూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మంగళవారం తెలిపారు. వీఐపీలు, అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కూర్చునేందుకు వీలుగా పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. సభా ఏర్పాట్లను ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో కొంకి అప్పారావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ తదితరులు పర్యవేక్షించారు.

సుమతీ శతకం పద్య పోటీలు


విజేతలకు తెలుగు పద్యాల పుస్తకాలను అందించిన బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో విద్యార్థులకు తెలుగు భాషపై ఆసక్తి పెంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. జీవీఎంసీ నిదానందొడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సుమతీ శతకం పద్యాల పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యం, తెలుగు పద్యాల గొప్పతనం తెలిపేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. అంతకు ముందు నిర్వహించిన పద్య పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరుగుర్ని విజేతలుగా ఎంపిక చేసి, వారికి తెలుగు పద్యాల పుస్తకాలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.గాయత్రి, ఉపాధ్యాయులు జె.కల్యాణి, ఎంఎస్ ఫాతిమా, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్‌గుప్తా, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోన్ పరిధి దుకాణాలకు వేలం


జెడ్సీ కార్యాలయ చాంబర్లో వేలం పాటలో పాల్గొన్న వ్యాపారస్తులు

అనకాపల్లిటౌన్ : జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ దుకాణాలకు జోనల్ కార్యాలయంలో మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ పి.వెంకటరమణ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని మెయిన్ రోడ్డులో చేపల బజారుకు, ఎన్టీఆర్ క్రీడామైదానం దుకాణాలకు వేలం నిర్వహించగా ఐదుగురు మాత్రమే పాల్గొన్నట్టు తెలిపారు. క్రీడామైదానం వద్దనున్న నెం.7 దుకాణాన్ని గవరపాలేనికి చెందిన జె.శంకరరావు రూ.26 వేలుకు వేలంలో దక్కించుకున్నట్టు పేర్కొన్నారు. చేపల బజారుకు వేలం పాట మరోసారి నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జోనల్ సూపరింటెండెంట్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలకు సత్కారం


సన్మానం అందుకున్న కశింకోటలోని పీహెచ్‌సీ సిబ్బందితో బ్రహ్మకుమారీస్

కశింకోట : ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా కశింకోట పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బందిని బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. అమృతోత్సవాల్లో భాగంగా కరోనా సమయంలోనూ, ఆ తర్వాత అందిస్తున్న సేవలకు గుర్తింపుగా వైద్యాధికారి తిరుపతిరావు, సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, బ్రహ్మకుమారీలు విజయ, ధనలక్ష్మి, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆసరా సభకు తరలిరండి

కశింకోట : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 9 గంటలకు జరగనున్న వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు కోరారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులకు మూడో విడత చెక్కులను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు, కన్వీనర్లు, గృహ సారథులు, అభిమానులు, మహిళా సంఘాల ప్రతినిధులు హాజరుకావాల్సిందిగా కోరారు.

డైట్‌లో బాబూజగ్జీవన్‌రామ్ జయంతి


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల విభాగాధిపతులు, విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : అంటరానితనంపై అలుపెరుగని పోరాటం చేసింది బాబూజగ్జీవన్‌రామ్ అని డైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం జగ్జీవన్‌రామ్ ముందస్తు జయంతి వేడుకలు జరిగాయి. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి తరలిన సీఐటీయూ నాయకులు


చలో ఢిల్లీ కార్యక్రమానికి బయల్దేరుతున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఢిల్లీలో ఈ నెల 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు పరవాడ మండలం నుంచి సీఐటీయూ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తాండ్ర మల్లేశ్వరరావు, యూనియన్ ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మణ్ తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 3,941 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,140	4,300
మొదటి రకం	3,950	4,180
రెండో రకం	3,430	4,040
మూడో రకం	3,150	3,380

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-32 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-45 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 382 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 353 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

బీమా పరిహారం పంపిణీ


బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న బ్యాంకు అధికారులు

అనకాపల్లి రూరల్ : మండలంలోని మొండిపాలెం, అచ్చయ్యపేట గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు మంగళవారం జీవన జ్యోతి బీమా పరిహారాన్ని పంపిణీ చేశారు. ఏపీజీవీబీ తుమ్మపాల బ్రాంచి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మొండిపాలెం గ్రామానికి చెందిన మజ్జి సత్య అప్పారావు, అచ్చయ్యపేట గ్రామానికి చెందిన బాలిబోయిన గోవింద్ కుటుంబాలకు ఈ పరిహారం అందజేశారు. ఖాతాదారులు, ప్రజల సమక్షంలో బాధిత కుటుంబాలకు బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు చెక్కులను అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షలు చొప్పున బీమా పరిహారం అందింది. కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులు మోటమర్రి శ్రీనివాసరావు, ఉరిగిటి కమల, బాదం తాతారావు పాల్గొన్నారు.

అందరికీ అనుసరణీయం హిందూ ధర్మం


సమావేశంలో మాట్లాడుతున్న వినాయకరావుపాండే

అనకాపల్లిటౌన్ : అన్ని వర్గాలకు ఆచరణీయమైన ధర్మం హిందూ ధర్మమని విశ్వ హిందూ పరిషత్ సామాజిక సమరసత కేంద్ర కార్యదర్శి వినాయకరావుపాండే అన్నారు. స్థానిక గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో మంగళవారం పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని కులాల వారిని సమన్వయం చేసుకుంటూ హిందూ ధర్మ వ్యాప్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అయోధ్య రామాలయం నిర్మాణంలో భాగంగా రాష్ట్రంలో పర్యటిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిషత్ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శులు తనికెళ్ల రవికుమార్, శివశంకర్, పరిషత్ ప్రాంతీయ కార్యదర్శి శ్రీకాళహస్తి పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం

- 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమంపై అవగాహన
- సచివాలయ గృహసారథులు, కన్వీనర్లతో ఎంపీపీ సూరిబాబు


కొత్తూరులో జగనన్నే మా భవిష్యత్తు గురించి వివరిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లి రూరల్ : పేదల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై అవగాహన కోసం కొత్తూరు, సత్యనారాయణపురం, సంపతిపురం, బీఆర్టీ కాలనీ సచివాలయాల గృహసారథులు, కన్వీనర్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపే లక్ష్యంగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, క్షేత్ర స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురుంచి ప్రజలకు పూర్తిగా వివరించాలని సూచించారు. ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచిని అర్థమయ్యేలా వివరించాలని కోరారు. అలాగే ప్రజల నుంచి వచ్చే స్పందనను 8296082960 నంబరుకు ఫోన్లు చేయించి చెప్పేలా చూడాలన్నారు. సమావేశాల్లో సర్పంచ్‌లు, స్థానిక నాయకులు సప్పవరపు లక్ష్మీ ప్రసన్న, పలకా సత్తిబాబు, గూన నాగరాజు, భీశెట్టి జగన్, మొల్లేటి శివాజీ, పి.రమేష్, బొండా అప్పలరాజు, పసుపులేటి రామకృష్ణ, పెద్దాడ రామ్ శంకర్, కరణం సత్తిబాబు, యాకుబు, పల్లా శ్రీను, దాకవరపు గోవిందు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా మొదలైన చోడమాంబిక అమ్మవారి పండగ


అమ్మవారి సన్నిధిలో భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి వెలసిన చోడమాంబిక అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యింది. తెల్లవారు జాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాల పరిసరాల్లో సందడి నెలకొంది. భక్తుల కోలాహలంతో పాటు, పలు విక్రయల స్టాల్స్ నడుమ చోడపల్లిలో ఉత్సాహ వాతావరణం నెలకొంది. పండగను పురస్కరించుకొని జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు నిర్వహించారు.

నేడు పెందుర్తిలో సచివాలయ కన్వీనర్ల సమావేశం

సబ్బవరం: పెందుర్తి తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో బుధవారం సచివాలయం కన్వీనర్లతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సబ్బవరం మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అధ్యక్షతన బుధవారం ఉదయం 8 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించడం, ఈ నెల 7న ప్రారంభంకానున్న జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమ కార్యాచరణపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశానికి సచివాలయ కన్వీనర్లు అందరూ విధిగా పాల్గొవాలని ఆయన పిలుపు నిచ్చారు.

వయోవృద్ధుల సమావేశం నేడు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతుభారతి హాల్లో బుధవారం వయోవృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించనున్నట్టు సంఘ వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వృద్ధుల సమస్యలు, పరిష్కార చర్యలపై సమావేశంలో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశానికి వృద్ధులందరూ హాజరుకావాలని కోరారు.

కల్యాణ మండపానికి భూమిపూజ నేడు

కశింకోట : స్థానిక పంచాయతీ కార్యాలయం దరి మార్కెట్ స్థలంలో రూ.50 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణానికి బుధవారం ఉదయం 9 గంటలకు భూమి పూజ జరపనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరబిందో ఫార్మాసిటీ సహకారంతో నిర్మించనున్న ఈ కల్యాణ మండపానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఇసుక అక్రమ తరలింపుపై కేసు

కశింకోట : మండలంలోని బుచ్చియ్యపేట శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్ కోట్ని రాజాబాబును అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


బదిలీ అయిన హౌసింగ్ ఏఈ భవ్యతేజను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. మునగపాక మండల హౌసింగ్ ఏఈగా పనిచేసి దేవరాపల్లికి బదిలీపై వెళ్లిన భవ్యతేజను మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ భవ్యతేజ జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావడంలో ఎంతో కృషి చేశారన్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

హైవేపై భారీ ట్రాలర్లు


కశింకోట వద్ద జాతీయ రహదారిపై తరలి వెళుతున్న భారీ ట్రాలర్

కశింకోట : కశింకోట వద్ద జాతీయ రహదారిపై రెండు పొడవైన పెద్ద ట్రాలర్లు స్థానికుల్ని ఆశ్చర్యానికి గురిచేశాయి. చెన్నై ప్రాంతం నుంచి అస్సాంకు ఖారీ ఇంజినీరింగ్ యూనిట్లను రెండు కంటైనర్లు తీసుకెళ్లాయి. ఒక్కొక్క కంటైనర్‌కు 66 చక్రాలున్నాయి. ముందు ఇంజిన్ భాగంలో పది చక్రాలు, కంటైనర్ భాగంలో ముందు, వెనుక కలిపి 56 చక్రాలతో చాలా పొడవుగా ఉంది. దీంతో వీటిని పిల్లలు, వృద్ధులు ఆసక్తిగా తిలకించారు.

యూకలిప్టస్ చెట్లను నరికిన వ్యక్తిపై కేసు


యూకలిప్టస్ చెట్లను కొట్టేసిన ప్రదేశం

అనకాపల్లి టౌన్ : మండలంలోని గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేట సర్వే నెం.107 ప్రభుత్వ భూమి లో యూకలిప్టస్ చెట్లను నరికిన వ్యక్తిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ గంగాధరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెం.107 అనుకుని రహదారి ప్రక్కన గ్రామీణ విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ లైన్లు వేస్తున్న సమయంలో గోపాలపురం గ్రామానికి చెందిన వ్యక్తి ఈ నెల 3న దాదాపు పావు ఎకరంలోని చెట్లను నరికి వేసినట్లు గుర్తించామన్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వ స్థలంలో చెట్లు/మొక్కలను నరికినప్పుడు సంబంధిత శాఖాధికారులకు సమాచారం అందించాలి. ఎలాంటి ముందస్తు అనుమతుల్లేకుండా చెట్లను నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఘనంగా అమ్మవారి జాతర మహోత్సవాలు


ఇందేశమ్మతల్లి ఆలయంలో భక్తుల పూజలు

కోటవురట్ల : చౌడువాడ గ్రామంలో చిట్టి పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయానికి వేకువ జాము నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే పందూరులో ఇందేశమ్మతల్లి జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.